క్లుప్తంగా

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అంజేస్తున్న ఆశలు, సీఐటీయూ నేతలు

యాచారం: ప్రజారోగ్యం కోసం పరితపించే ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నేతలు బ్రహ్మయ్య, చందునాయక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సీహెచ్‌సీ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆశలను పర్మినెంట్ చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్య సేవల్లో ప్రత్యేక అలవెన్స్‌లు అందించాలని కోరారు. ఆశలు ముక్తాబాయ్, స్వరూప, శోభ, అలివేలు, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత వైద్యం



రైతులకు మందులు అందజేస్తున్న పశు వైద్య సిబ్బంది

కడ్తాల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధి సాలార్‌పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు సంతానోత్పత్తి వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. రైతులు తమ పశుసంపదను తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించారు. పశువైద్యుడు భానునాయక్ ఆధ్వర్యంలో పశువులకు సాధారణ చికిత్స, కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పాడి సంరక్షణకు, పశుగణాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జేవీఓ లక్ష్మయ్య, పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



సునీల్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ పాండు

ఆమనగల్లు: 12వ ఇన్‌స్పైర్ అవార్డ్స్, ఎగ్జిబిషన్ 2023–24కు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సునీల్ ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో రోజు వారి జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాత్రపై సునీల్ ప్రదర్శన ఇచ్చారు. దీంతో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థి సునీల్, సహకరించిన సహ అజయ్‌తేజ, ఉపాధ్యాయుడు బాలనాగయ్యలను ఎంఈఓ పాండు సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీదర్, రామస్వామి, కృష్ణయ్య, అశోక్‌రెడ్డి, మాధవి, రమాదేవి, కుసుమలత, మెర్సిలియా, మాలతి, వనిత, పద్మ, ఆచారి తదితరులు ఉన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆమనగల్లు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశుద్ధ్య కార్మికులను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంతలు సత్కరించారు. ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో.. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

మంచాల: అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఎఫ్‌డీఓ వేణు మాధవ్ అన్నారు. మంగళవారం ఆగాపల్లి నర్సరీలో జీపీ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. అడవులను కాపాడుకోవడం వల్లన కలిగే ప్రయోజనాలు, అడవుల నరికి వేతతో కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో అటవీ శాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, కస్నానాయక్, నర్సింహ, చంద్రశేఖర్, విజయ్ భాస్కర్‌రెడ్డి, యాచారం ఎంపీడీఓ నరేందర్, మంచాల ఎంపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ
- అర్హులందరికీ రుణమాఫీ: వక్తలు
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవం
- సంక్షేమ పథకాలపై కళాజాత



తుర్కయంజాల్‌లో.. చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తదితరులు



ఇబ్రహీంపట్నం రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా మంగళవారం పురపాలికలో అర్బన్ డేను ఘనంగా నిర్వహించారు. మంగళ్‌పల్లి గేటు నుంచి టౌన్ వరకు ప్లకార్డులతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. లబ్ధిపొందని వారికి త్వరలోనే చేయనుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. అర్హులందరికీ అందేలా చూస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ కృష్ణంరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పు జంగయ్య, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

తుర్కయంజాల్: నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్థానిక కూడలి నుంచి మాసబ్ చెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెరువులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పుర సిబ్బందితో తొలగింపచేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందికి ఆప్రాన్స్, గ్లౌజ్‌లు, మాస్కులు, బూట్లు పంపిణీ చేశారు. పాలకమండలి సభ్యులు, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం



పథకాల గురించి వివరిస్తున్న కళాబృందం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వ కృషి చేస్తుందని, అందుకు అనే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని డీఆర్ఓ వెంకటేష్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ సంబురాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. డీపీఆర్ఓ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల గురించి కళాజాత బృందం చేత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో అనిల్ బృందం, రావిర్యాల, ఇమామ్‌గూడ, తక్కుగూడ బస్టాఫ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రం అనాజ్‌పూర్ గ్రామంలో యాదయ్య కళాబృందం, కొందుర్గు మండలంలో పెద్ద ఎల్కిచెర్ల ప్రాంతంలో మల్లంపల్లి రాజు కళాబృందం ప్రదర్శనలు చేపట్టిందని ఆయన వెల్లడించారు.

మహిళా సంఘాలకు రూ. కోటి చెక్కు



పెద్దఅంబర్‌పేటలో.. చైర్ పర్సన్ జయశ్రీ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కేంద్రంలో అర్బన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ ఆధ్వర్యంలో జేసీబీ షోరూం నుంచి 5వ వార్డు అంబేడ్కర్ భవనం వరకు వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, రిసోర్స్ పర్సన్లు పారిశుద్ధ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీ కిట్స్ పంపిణీ చేశారు. వారిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం 10 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1 కోటి విలువైన రుణం మంజూరు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విద్యావతి, అనురాధ, రాజేందర్, అర్చన, హరిశంకర్, కృష్ణారెడ్డి, డీఈఈ శివానంద్, సుమంత్, మేనేజర్ కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ధృవతార శ్రీకాంత్‌చారి

వర్ధంతిలో నాయకులు



యాచారం: శ్రీకాంత్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విశ్వకర్మ మనుమయ సంఘం నేతలు

యాచారం: శ్రీకాంత్‌చారి ప్రాణత్యాగంతోనే ప్రత్యేక రాష్ట్ర పోరాటం ఊపందుకుందని విశ్వకర్మ మనుమయ సంఘం నేతలు అన్నారు. శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రీకాంత్ తెలంగాణ ధృవతార అని, ఆయనను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరని తెలిపారు. కార్యక్రమంలో మారోజ్ శ్రీనువాస్‌చారి, గౌర నర్సింహ, శ్రీనువాస్ చారి, నర్సింహ పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతచారి వర్ధంతిని మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చారి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు ఆనంద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నర్సింహ, హరిచంద్, లక్ష్మన్‌చారి, శ్రీనునాయక్, పాండునాయక్, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రథమ శ్రేణి న్యాయమూర్తి స్వరూప



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వరూప

ఆమనగల్లు: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసు కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈ నెల 14 నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గం ఎంచుకోవాలని సూచించారు. రాజీనే రాజమార్గమని, రాజీతో సమస్యలు పరిష్కరించుకుంటే కాలం, డబ్బు కలిసి వస్తుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఏపీపీ కార్తీక్, సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, మాడ్గుల సీఐ జగదీశ్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సతీష్ రెడ్డి

తుర్కయంజాల్: కొత్త ఆవిష్కరణలకు మూలం సృజనాత్మకని, విద్యార్థులందరూ దానిని పెంపొందించుకోవాలని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం మన్నెగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ నిర్మాణంలో భాగస్వాములయ్యే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎన్ఆర్ఎస్‌సీ–ఇస్రో పబ్లిక్ ఔట్ రీచ్ డివిజన్ హెడ్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఫినాక్ ప్లస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రభాకర్ రావు, డీఆర్‌డీఓ శాస్త్రవేత్త, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ వీర బ్రహ్మం, శాస్త్రీయ వ్యోమగామి అభ్యర్థి జాహ్నవి, క్రెడీలా ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్రాంచ్ డెవలప్‌మెంట్ మేనేజర్ యశ్వంత్, పాఠశాల ఎండీ సంగమేశ్వర గుప్తా, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: యూటీఎఫ్ మండల అధ్యక్షురాలిగా ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సరస్వతి ఎన్నికయ్యారు. పట్టణంలో మంగళవారం జరిగిన మండల మహాసభలో జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాములయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరస్వతి, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, బాలమణి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా బాలనాగయ్య, కార్యదర్శులుగా ప్రియాంక, యాదగిరి, గన్య, వసంత, సుభాష్, మధుకర్, రామ్‌జీ, శ్రీనులను నియమించారు.

నాసిరకం విత్తనాలతో పంట నష్టం

- న్యాయం చేయాలంటూ రైతుల విన్నపం
- ధాన్యం రాశులను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



ధాన్యం పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓలు

తలకొండపల్లి: నాసిరకం విత్తనాలతో పంట నష్టపోయామని మండల పరిధి రాంపూర్ రైతులు ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఏఓ రేణుక, ఏఈఓలు శ్రీనాథ్, శ్రీకాంత్‌లు రాంపూర్‌లో పర్యటించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సాధారణంగా ఎకరాకు వరి దిగుబడి 22 నుంచి 24 క్వింటాళ్ల వస్తుందని, నాసిరకం సీడ్స్‌తో 15 నుంచి 17 క్వింటాళ్లే వచ్చిందని పేర్కొన్నారు. దిగుబడి తగ్గి నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. తగిన పరిహారం అందించాలని కోరారు. అనంతరం అధికారులు ధాన్యపు గింజలను పరిశీలించి మాట్లాడారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు వివరించి, నివేదిక అందజేస్తామని చెప్పారు. వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'గ్యారంటీల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం'

తుర్కయంజాల్: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి నోముల దయానంద్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీ కన్వీనర్ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన సమావేశంలో 'ప్రజాయాత్ర' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయిందని విమర్శించారు. అర్హులందరికీ రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బుధవారం నుంచి రెండు రోజుల పాటు బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ఆమనగల్లు: గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిలు, బాలస్వామి, సుభాష్, శివకుమార్, యాదయ్య, రంజిత్, విక్రం, దేవేందర్, మహేశ్, గణేశ్‌నాయక్, యాదయ్య, భీమ్‌జీ నాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం కంటే ఆత్మస్థైర్యం గొప్పది



మాడ్గుల: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, విద్యార్థులు తదితరులు



ఆమనగల్లు: విద్యార్థులతో ఎంఈఓ తదితరులు

దివ్యాంగుల దినోత్సవంలో ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: వైకల్యం కంటే ఆత్మస్థైర్యం గొప్పదని ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్కాల పరమేష్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నాలుగో తరగతి విద్యార్థిని ఫాతిమకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, ముబారక్ పాష తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..

తలకొండపల్లి: దివ్యాంగులు అధైర్య పడొద్దని, స్థిరమైన భవిష్యత్తును ఎంచుకుని ముందుకు సాగాలని ఎంఈఓ చాంప్లా నాయక్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగులు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ ఆధ్వర్యంలో వికలాంగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆట పరికరాలు బహూకరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు మల్లేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, జానకీరామ్, ఉపాధ్యాయులు సుధాకర్, వసంతకుమారి, ప్రత్యేక ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, సీఆర్‌పీ మధు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, సిబ్బంది తిరుపతి పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని భవిత సెంటర్‌లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి ఎంఈఓ పాండు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు యాదయ్య, లావణ్య, సీఆర్‌పీ కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి మేడిగడ్డతండాకు చెందిన అనితకు రూ.60 వేలు, శెట్టిపల్లి గ్రామానికి చెందిన శ్రీనుకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆశల వేతనం పెంచండి



తలకొండపల్లి: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆశలతో కలిసి పీహెచ్‌సీ డాక్టర్ స్నేహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ఆశలకు నెలసరి వేతనం రూ.18వేలతో పాటు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందులో ఆశల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి శిరీష, నిర్మల, శ్రీదేవి, నర్సమ్మ ఉన్నారు.

◆ ప్రజాపాలనపై సమీక్ష

మంచాల: ప్రజాపాలనలో సాధించిన అభివృద్ధిపై సమీక్ష చేసుకోవాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనలో 13,520 కుటుంబాల వివరాలను సేకరించి, ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మండల వ్యాప్తంగా 23వేల మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో సీడీపీఓ వినిత దేవి, ఎంపీఓ ఉమారాణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ బూత్ అధ్యక్షుల ఎన్నిక

తలకొండపల్లి: మండల పరిధి పడకల్‌లో బూత్ అధ్యక్షులను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 14వ బూత్ అధ్యక్షుడిగా కుమార్ యాదవ్, 15వ బూత్ అధ్యక్షుడిగా ప్రవీణ్‌లను నియమించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి పాండు, జిల్లా కార్యదర్శి పాండు ప్రసాద్, కుమార్, శ్రీశైలం, ప్రకాశ్ ఉన్నారు.

◆ నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండల పరిధి పలువురు లబ్ధిదారులకు రూ.1.11 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేయనున్నారు. అదే విధంగా ఎస్‌హెచ్‌జీ ద్వారా సంఘాలకు రూ.కోటి విలువ చేసే రుణాల చెక్కులను ప్రజాభవన్‌లో అందజేయనున్నట్లు ఆ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

◆ ముగ్గువేసి.. అవగాహన కల్పించి



ఇబ్రహీంపట్నం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రహదారుల పక్కన చెత్తాచెదారాన్ని తొలగించారు. ముగ్గులు వేసి, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రజాపాలన ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగ యాదవ్, కమిషనర్ రవీంద్రసాగర్, మెప్మా సిబ్బంది ఉన్నారు.